
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



నల్లగొండ
5
శుక్రవారం 16 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
నల్లగొండ	రూ.165	245	270

గుడ్డు డజన్ ధర : 66

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 । కనిష్ఠం 24.4

అందాల భామలు అబ్బురపడేలా ఆతిథ్యం. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా, కళాత్మకత కట్టిపడేసేలా స్వాగతం. ఆద్యంతం అందాలభామలు ఆనందపడేలా చేసింది. ప్రపంచ సుందరీమణుల పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి వచ్చిన సుందరీమణులు గురువారం జిల్లాలో పర్యటించారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన నృసింహ క్షేత్రాన్ని, ప్రపంచ ప్రసిద్ధి చెందిన పోచంపల్లి చేనేత కళాత్మక పట్టణాన్ని సందర్శించారు. అడుగడుగునా వారికి అందిన ఆదరాభిమానాలు చూసి మంత్రముగ్ధుల య్యారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా నుదుటిన బొట్టు, సిగలో మల్లెపూలు పెట్టుకొని వచ్చి, అందరినీ ఆకట్టుకున్నారు. వారికి స్వాగతం పలికేందుకు వచ్చిన కళాకారులతో కలిసి నాట్యం చేస్తూ.. డోలు సన్నాయి వాయిస్తూ.. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. యాదగిరీశుడి క్షేత్రంలో కృష్ణరాతి శిలలతో కూడిన ఒక్కో నిర్మాణాన్ని చూసి అబ్బురపడి, ప్రపంచ చేనేత వస్త్రకళాకారుల సృజనాత్మకతను చూసి ఆనందపడ్డారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)



భూదాన్‌పోచంపల్లిలో సుందరీమణుల అభివాదం



భూదాన్‌పోచంపల్లిలో రాట్నం తిప్పుతున్న ప్రపంచ సుందరిపోటీదారు

భక్తి... ఆనంద పరవశం





- అందాలభామల మనసు దోచిన ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలు
- మిస్‌వరల్డ్ పోటీదారులకు యాదాద్రి భువనగిరి జిల్లా అతిథ్యం
- పోచంపల్లి సందర్శనలో ప్రత్యేక ఆకర్షణగా చేనేత వస్త్రాల ఫ్యాషన్‌షో

జిల్లాలోని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలు ప్రపంచ సుందరీమణుల మనసులను దోచుకున్నాయి. జిల్లాలో మిస్‌వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొంటున్న కరేబియన్ దీవుల్లోని దేశాలు చెందిన తొమ్మిది మంది, ఆఫ్రికన్ దేశాలకు చెందిన 25మంది అందెగత్తెలు గురువారం జిల్లాలో పర్యటించి, ఈ ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలను చూసి మంత్రుముగ్దులయ్యారు. జిల్లాలోని ప్రపంచస్థాయి గుర్తింపునకు నోచుకున్న ఆధ్యాత్మిక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సిల్క్‌సిటీ సాంస్కృతిక వారసత్వం ఇక్కత్ చీరల నేతకు ప్రసిద్ధిగాంచిన భూదాన్‌పోచంపల్లి అందాలభామలకు ఆతిథ్యమిచ్చాయి.

చీరకట్టు సంప్రదాయంలో..

సుందరాంగులు తలలో మల్లెపూలు పెట్టుకుని... లంగా వోణీలు, చీర కట్టు సంప్రదాయ దుస్తులు ధరించి స్వామివారిని దర్శించుకున్నారు. నుదుట బొట్టు పెట్టుకొని, పూలమాలలు అందిస్తూ పోచంపలిక్లికి హృదయపూర్వక స్వాగతమంటూ హత్తుకునేలా ఆత్మీయ స్వాగతం పలికారు. గ్రామ చేనేత పార్కు ప్రవేశ ద్వారం నుంచి స్థానికులు సంప్రదాయ వస్త్రాలతో సుందరీమణులకు స్వాగతం పలికారు. చేనేత టూరిజం పార్కులో స్థానిక కళాకారులు ప్రదర్శించిన రంజు, కిన్నెర, వాయిద్యాల మధుర సంగీతం మంత్రముగ్దులను చేసింది. ప్రభుత్వం మిస్‌వరల్డ్ పోటీల సందర్భంగా చేనేత, ఇక్కత్ వస్త్రాలపై దేశ చరిత్రలోనే ఇప్పటివరకు ఎన్నడూ లేనివిధంగా ఫ్యాషన్‌షో నిర్వహించింది. చేనేత వస్త్రాల తయారీ విధానాన్ని పరిశీలించి ప్రపంచ అందగత్తెలు ష్టైమరిచిపోయారు. తెలంగాణలోని చేనేత రంగాన్ని ప్రభుత్వం విశ్వవ్యాప్తం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంది. మిస్‌వరల్డ్ పోటీదారులు భూదాన్‌పోచంపల్లి గ్రామాన్ని సందర్శించి, పోచంపల్లి చీరల తయారీ, డిజైన్, అద్దకం, ఇక్కత్ వస్త్రాలను చూసి అబ్బురపడ్డారు. ప్రత్యేకంగా ఇక్కత్ చీరల తయారీ విధానాన్ని చూసి అబ్బురపడ్డారు. ఒక చీరకు పెట్టే శ్రమ, డిజైన్ల సృజనాత్మకత భామలను హత్తుకుంది. చేనేత గ్రామీణ పార్కు ఆవరణలో ఏర్పాటుచేసిన పోచంపల్లి, వెంకటగిరి, గొల్లబామ, నారాయణపేట వస్త్ర ప్రదర్శనను సందర్శించారు. యాంపీ థియేటర్‌లో భూదాన్‌పోచంపల్లి ప్రస్తావనం, హ్యాండ్లూమ్‌పై ప్రత్యేక వీడియోను అందాలభామలకు ప్రదర్శించారు. ఈ పర్యటన సాయంత్రం 5.30గంటల నుంచి 8.30గంటల వరకు ఆహ్లాదకరంగా సాగింది.



యాదగిరిక్షేత్రంలో నమస్కరిస్తున్న సుందరీమణులు



భూదాన్‌పోచంపల్లిలో ఫ్యాషన్ షోలో ర్యాంప్‌వాక్ చేస్తున్న మోడల్స్

సంప్రదాయంగా యాదగిరిగుట్టకు..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రం ప్రపంచ సుందరీమణులు సందర్శించారు. స్వామివారి సేవలో అందాలభామలు అఖండ దీపారాధన చేశారు. అన్నామాచర్య ట్రస్ట్‌కు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శన, కోలాట ప్రదర్శన మధ్యనుంచి అందాలభామలు నడుచుకుంటూ వెళ్లారు. ఆ కోలాటల ప్రదర్శను చూసి వారంతా ఆనందం వ్యక్తం చేశారు. కొంతమంది నృత్యం కూడా చేస్తూ కదిలారు. బంగారు తాపడం ఉన్న గోపురాన్ని చూసి మంత్ర ముగ్ధులయ్యారు. బ్రహ్మోత్సవ మండపానికి చేరుకుని స్వర్ణ ధ్వజస్థంభం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అక్కడే ఫొటో షూట్ నిర్వహించారు. క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామి దేవాలయం ధ్వజస్థంభం స్వయంభు గర్భాలయానికి చేరుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. పంచ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలో వేద పండితులతో ఆశీర్వచనం పొందారు. ఆలయ అంతర్ మాఢవీధులను తిలకించారు. రెండుగంటల పదిహేను నిమిషాల వరకు అందాలభామల పర్యటన ఆధ్యాత్మిక క్షేత్రంలో ఉల్లాసంగా సాగింది.

'నెల్లికల్లు' పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జానారెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఇలాత్రిపాఠి

నాగార్జునసాగర్, మే 15(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని కృష్ణపట్టి తండాల్లో సాగునీటి కోసం చేపట్టిన నెల్లికల్లు ఎత్తిపోతల పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అధికారులను ఆదేశించారు. సాగర్‌లోని విజయవిహార్ అతిథిగృహంలో గురువారం ఆయన కలెక్టర్ ఇలాత్రిపాఠి, సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ, అదనపు కలెక్టర్ రాజశేఖర్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. నెల్లికల్లు ఎత్తిపోతల పథకం కోసం భూ సేకరణ పనులు పూర్తి చేయాలని సూచించారు. అలాగే తిరుమలగిరి(సాగర్) మండలంలో పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న భూ భారతి సర్వేను వేగవంతం చేసి అర్హులైన వారికి పట్టదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పండ్ల తోటలను సద్వినియోగం చేసుకోవాలి : డీఆర్‌డీఏ పీడీ



మునగ తోటను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శేఖర్ రెడ్డి

శాలిగౌరారం, మే 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వంద శాతం ఉచితంగా అందించే పండ్ల తోటలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామంలో నర్సరీ, మునగతోటను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందికి నర్సరీల పెంపుదలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో నర్సరీలపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బంది శ్రద్ధ వహించాలని అన్నారు. గ్రామాల్లో ఇంకుడు గుంతలు, పాంపాండ్ పనులు చేపట్టాలని సూచించారు. అన్ని గ్రామాల్లో జూన్ నాటికి ప్లాంటేషన్‌కు సిద్ధంగా ఉండే విధంగా ప్రణాళిక చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ పీడీ నర్సింహారావు, క్లస్టర్ టీఏ రమణ, ఎంపీవో సుధాకర్, ఏపీవో జంగమ్మ, టీఏలు నరేష్, సత్యనారాయణ, విక్రమ్, రవి కిరణ్, శోభారాణి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సహకారం

రుణాలపై వడ్డీ తగ్గింపు



ప్రాథమిక సహకార సంఘాలకు సంబంధించి రైతులకు ఇస్తున్న రుణాలపై వడ్డీని తగ్గించేందుకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కీలకమైన నిర్ణయం తీసుకుంది. గురువారం జిల్లాకేంద్రంలోని డీసీసీబీలో జరిగిన అడిట్ కమిటీ కంప్లేయాన్ సబ్ కమిటీ సమావేశంలో అనేక అంశాల గురించి పాలక వర్గం చర్చించింది. బంగారు రుణాలతోపాటు ఇతర అన్ని వ్యవసాయ రుణాలకు సంబంధించి ఖాతాదారులు, వ్యవసాయదారులకు భారం కలగకుండా ఉండేలా విధివిధానాలు రూపొందిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)

- సబ్ కమిటీలో డీసీసీబీ పాలకవర్గం నిర్ణయం
- పీఏసీఎస్‌ల ద్వారా అద్దెకు డ్రోన్‌లు
- ఏఐఎఫ్ పథకం నుంచి కేంద్రం సబ్సిడీ
- ఉమ్మడి జిల్లా సహకార రైతులకు ప్రయోజనం

సహకార రుణాలపై వడ్డీ తగ్గింపునిస్తూ బ్యాంకు నిర్ణయం వెలువడిన వెంటనే ఉమ్మడి జిల్లాలోని సహకార బ్యాంకుల్లో ఖాతాదారులైన రైతాంగానికి పెద్ద ఎత్తున ఊరట కలగనుంది. 1917లో రైతుల కోసం, రైతుల ద్వారా ఏర్పడిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 107 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో రైతులకోసం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది.నల్లగొండ,సూర్యాపేట,యాదాద్రి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 38 శాఖలు, 107 సహకార సంఘాలు ఉన్నాయి.2023-24 సంవత్సరంలో లాభాలు రూ.30కోట్లు ఉండగా, 2024-25 సంవత్సరంలో రూ.42.31కోట్లకు చేరింది. అంటే రూ.12.31కోట్లు పెరిగినట్లు తెలుస్తోంది.

అదేవిధంగా వ్యాపారం విషయంలో 2023-24లో రూ.2300కోట్లు ఉండగా 2024-25లో రూ.2850.81కోట్లకు చేరుకోగా రూ.550. 81కోట్లకు పెరిగింది. ఎన్‌పీఏ (నిరర్థక ఆస్తులు) 2023-24లో 1.85శాతం ఉండగా 2024-25 ఆర్థి క సంవత్సరంలో 1.38 శాతంకు చేరి 0.47శాతానికి తగ్గింది. దీంతో బ్యాంకు లాభాల బాటలో పయనిస్తున్న నేపథ్యంలో సహకార రుణాలపై వడ్డీ తగ్గించడానికి పాలకవర్గ సభ్యులు ఐక్యంగా నిర్ణయం తీసుకోనున్నారు. దీంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

ఏఐఎఫ్ నిధులతో డ్రోన్‌లు మంజూరు

అగ్రి ఇన్‌ఫ్రా ఫండ్ (ఏఐఎఫ్) పథకం కింద కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వినూత్నమైన పథకాన్ని అందుబాటులోకి తీసుకవస్తుంది. సొసైటీలకు లాభంతోపాటు రైతులకు ప్రయోజనం ఉండేలా డ్రోన్‌లను పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం వ్యవసాయదారులు ఎకరానికి రూ.500 చెల్లించి డ్రోన్‌ల ద్వారా మందులను పిచికారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 107 పీఏసీఎస్‌లకు ఏఐఎఫ్ పథకం కింద డ్రోన్‌లను ఇవ్వనున్నారు. ఒక్కో సొసైటీకి 2నుంచి 3 డ్రోన్‌లు ఇచ్చి వాటిని అద్దెకు నడపడం ద్వారా సొసైటీలకు ఆదాయంతోపాటు రైతులకు కేవలం ఎకరానికి రూ. 300 మాత్రమే తీసుకొని అద్దెకు ఇవ్వాలని డీసీసీబీ పాలకవర్గం ప్రణాళికను సిద్ధంచేసింది. దీని ద్వారా రైతులకు ఎంతగానో ఉపయోగం ఉండే అవకాశాలు ఉండటంతో ఆ వైపుగా ఆలోచన చేస్తున్నారు.

పెరిగిన రుణాల గరిష్ట పరిమితి....

గతంలో క్రాప్ లోన్ గరిష్ట పరిమితి రూ.1లక్ష ఉండగా దానిని రూ.1లక్ష50వేలకు పెంచారు....

- మిగతా 7వ పేజీలో...

వీపీవోలతో ప్రజలకు మెరుగైన సేవలు

● ఎస్పీ శరత్ చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్

హాలియా, మే 15(ఆంధ్రజ్యోతి): విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వీపీవో)వ్యవస్థ ఏర్పాటుతో ప్ర జలకు మెరుగైన సేవలు అందనున్నట్లు ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా అనుముల మండలం కొత్తప ల్లి గ్రా మంలో గురువారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విలే జ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ పోలీ స్టేషన్ పరిధిలో అనేక గ్రామాలు ఉంటాయి. ప్రతీ గ్రామానికి ఒక పోలీస్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఆయా గ్రామాల్లో జరిగే వివాదాలు, పంచాయతీలు పోలీస్‌స్టేషన్ వరకు రాకుండా చేయవచ్చని సూచించారు. సత్వర న్యాయం కోసమే విలేజ్ పోలీ స్ ఆఫీసర్ వ్యవస్థ లక్ష్యమన్నారు. వారి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సంబంధిత పోలీసులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మమేకమై ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలను మభ్యపెడు తూ అనేక స్కాంల పేరుతో గ్రామాల్లోకి వస్తున్నారని, అలాంటి వారి బారిన పడకుండా ప్రజలను చైతన్యవంతంగా ఉండాలని సూచించారు. అధిక వడ్డీ ఆశ చూ పించడంతో ప్రజలు ఆశపడి డబ్బులు పోగొట్టుకుంటున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖరరాజు, ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, గ్రామస్థులు అలుగుబెల్లి బ్రహ్మానందరెడ్డి,రమణారెడ్డి, నాగిరెడ్డి, కోటిరెడ్డి, గోవిందరెడ్డి, విజయ్, పోలీస్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎల్పీ మాజీ నేత జానారెడ్డిని కలిసిన ఎస్పీ

నాగార్జునసాగర్: సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డిని ఎస్పీ శరత్‌చంద్రపవార్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం సాగర్‌లోని ఆయన నివాసంలో కలిసి పూల మొక్క అందించి సన్మానించారు.

రేషన్ పంపిణీలో ఆలస్యం

- మరో 5 రోజులు గడువు పొడగింపు
- ఇప్పటి వరకు 68 శాతమే పంపిణీ

నల్లగొండ/నల్లగొండ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీలో ఆలస్యం జరుగుతోంది. ప్రతీ నెలా జిల్లాలో 9800 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ జరుగుతుంది. ప్రస్తుత జిల్లాలో 2,16,945 రేషన్‌కార్డులు ఉండగా ఈ కార్డుల్లో 13లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారు. సుమారు 940 చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ జరుగుతుంది. సన్నబియ్యాన్ని ప్రతి ఒక్క వినియోగదారుడు తీసుకుంటున్నారు. అయితే యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండటంతో లారీల కొరత ఏర్పడింది. దీంతో రేషన్ బియ్యాన్ని అనేక చోట్ల చౌకధరల దుకాణాలకు పౌరసరఫరాల సంస్థ సకాలంలో సరఫరా చేయలేదు. దీంతో రేషన్‌డీలర్లు సైతం ఏమి చేయలేకపోయారు. ఈ నెల 15వ తేదీతోనే పంపిణీ ముగియడంతో చా లా చోట్ల వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. దీంతో మరో 5 రోజుల పాటు బియ్యం పంపిణీ చేయడానికి గడువు పొడిగించారు. దేవరకొండ నియోజవర్గంలో 193 రేషన్‌షాపులకు సరఫరా చేయాల్సి ఉంది. చింతపల్లి, డిండి, కొండమల్లేపల్లి మండలాలో ని 15 రేషన్‌షాపులకు బియ్యం సరఫరా కాలేదు. అదేవిధంగా మిర్యాలగూడ పట్టణంలో 14 రేషన్ దుకాణాలకు ఆలస్యంగా బియ్యం సరఫరా కావడంతో లబ్ధిదారులకు మరో మూడురోజుల పాటు బియ్యం పంపిణీ చేయనున్నారు. లారీల కొరత కారణంగా కేతేపల్లి మండలంలో 10, 12 తేదీల్లో రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేశారు. దీంతో బియ్యం పంపిణీ ఆలస్యంగా సాగుతుంది. చండూరు మండలంలో తుమ్మలపల్లి, పుల్లెం ల, జోగిగూడెం, కొండాపురం గ్రామాలకు ఆలస్యంగా బియ్యం సరఫరా అయింది. దీంతో బియ్యం పంపిణీ కొనసాగిస్తున్నారు. డిండి మండలంలో లారీల కొరతతో గోనేబోయనపల్లి, ప్రతాప్‌నగర్, బొగ్గులదోన, గొనకోలు, వావిల్‌కోల్, రామనపల్లి గ్రామాలకు ఇంకా బియ్యం సరఫరా కాలేదు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్త హత్య
- వెల్మకన్నె హత్య కేసును ఛేదించిన పోలీసులు



7

సంప్రదాయపు సౌందర్యం



సోయగం



భక్తి..ఆనంద పరవశం

ఇక్కత్ వస్త్రాల సోయగాలు, సాంస్కృతిక వైభవాన్ని చాటే సంబురాలు, సంప్రదాయాన్ని తలపించిన స్వాగతాలు వెరసి భూదాన్‌పోచంపల్లిలో ప్రపంచ సుందరీమణుల పర్యటన ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య సాగింది. 'తెలంగాణ జరూర్ ఆనా' నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం మిస్ వరల్డ్ పోటీదారులతో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, పర్యాటక సందర్శన గురువారం పోచంపల్లిలో సందడిగా సాగింది.

(ఆంధ్రజ్యోతి- భూదాన్‌పోచంపల్లి)

సంప్రదాయపు కట్టుబొట్టు, ఆధ్యాత్మిక పరవశం మధ్య ప్రపంచ సుందరీమణుల యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ పర్యటన సాగింది. కొండపైకి చేరుకున్న ప్రపంచ సుందరీమణులకు ఘనస్వాగతం లభించింది. ఆలయ శిల్ప సంపదకు విదేశీ వనితలు ఫిదా అయ్యారు. వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు జాడా రామూన్, షట్రెయిన్ డ్యామ్స్, మైరా డెల్గాడో, నోయెమీ మిల్నే, క్రిస్టి గైరాండ్, తహ్జబెన్నెట్, ఆరేలీ జోచిమ్, వలేరియా పెరెజ్, అన్నా-లిస్ నాంటన్‌లు క్షేత్ర పర్యటనలో పాల్గొన్నారు. 2.15 గంటల పాటు సాగిన వీరి పర్యటన ఆనందం, ఆహ్లాదం మధ్య సాగింది.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట)



● యాదాద్రి జిల్లాలో సుందరీమణుల పర్యటన విజయవంతం

● పోచంపల్లి, యాదగిరిగుట్టలో పర్యటించిన అందాలభామలు

● ఉత్సాహంగా, ఆనందంగా సాగిన పర్యటన



ఇక్కత్ శాలువా కప్పి స్వాగతం పలుకుతున్న స్థానిక మహిళ

పోచంపల్లికి సాయంత్రం 5-30 గంటలకు టూరిజం బస్సుల్లో ఆఫ్రికా దేశాలకు చెందిన సుందరీమణులు పోచంపల్లిలోని టూరిజం పార్క్‌కు చేరుకున్నారు. కుంకుమ తిలకం దిద్ది, ఇక్కత్ శాలువా కప్పి ప్రవేశద్వారం నుంచి మ్యూజియం వరకు సాంప్రదాయ కోలాట ప్రదర్శనతో స్వాగతించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, రాచకొండ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్‌బాబు, డీసీపీ అక్షాంష్ యాదవ్, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, పర్యాటక శాఖ జీఎం ఉపేందర్‌రెడ్డిలతో పాటు కార్యక్రమ ఇన్‌చార్జి, తెలంగాణ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి స్వాగతం పలికారు. అనంతరం టూరిజం పార్క్‌లో చేనేత థీమ్‌పై ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించి పోచంపల్లి ఇక్కత్ ప్రాధాన్యం, ప్రాముఖ్యత, విశిష్టతలను తెలుసుకున్నారు.

సంప్రదాయపు కట్టుబొట్టుతో

కొండపైకి గురువారం సాయంత్రం 5 గంటలకు చేరుకున్న సుందరీమణులు ప్రోటోకాల్ అతిథి గృహంలో సాంప్రదాయ కట్టుబొట్టుతో ఆలయ సందర్శనకు సిద్ధమయ్యారు. కొబ్బరి నీళ్లు, టీ తాగిన తర్వాత ప్రోటోకాల్ కార్యాలయంలో ప్రొజెక్టర్ ద్వారా ఐదు నిమిషాల పాటు ఆలయ విశిష్టతను వైటీడీఏ వైస్ చైర్మన్ జీ కిషన్‌రావు వారికి వివరించారు. ఆలయ సందర్శనకు బయలుదేరిన వీరికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీసమేతంగా, అదనపు కలెక్టర్ వీరారెడ్డిలు పూలకుండీలు అందజేయగా, సన్నాయిమేళాలతో స్వాగతం పలికారు. అనంతరం బ్యాటరీ వాహనాల్లో కొండపైకి వెళ్లారు.



తులసీమొక్కను అందజేసి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి



అఖండదీపారాధనలో సుందరీమణులు

అక్కడ అధికారులు, ప్రభుత్వ విప్ కలిసి అఖండ దీపారాధన వరకు మరోసారి స్వాగతంపలికారు. అనంతరం సుందరీమణులకు ఆలయ పూజారులు తిలకం దిద్దారు. దీపారాధను నూనె సమర్పించి స్వామి చిత్రపటానికి మొక్కులు తీర్చుకొని టెంకాయ కొట్టారు. అనంతరం ఆలయ ఈశాన్యంలోని కళావేదిక వద్దకు వచ్చి పాత్రికేయులకు నమస్కరించారు. అదే దారిలో ముందుకెళ్లిన ముద్దుగుమ్మలు ఆలయ ఆగ్నేయంలోని బ్రహ్మోత్సవ మండపం వద్ద ఫొటోషూట్‌లో పాల్గొన్నారు.

అబ్బుర పరిచిన వస్త్ర తయారీ విధానం

చేనేత ఇక్కత్, డబుల్ ఇక్కత్ ప్రాశస్త్యం, ప్రాముఖ్యాన్ని స్థానికుల ద్వారా సుందరీమణులు తెలుసుకున్నారు. మ్యూజియంలో ఏర్పాటుచేసిన మగ్గాలపై చేనేత వస్త్రాలను నేసే ప్రక్రియను ప్రత్యక్షంగా తిలకించారు. సన్నని దారం నుంచి కండెలు చుట్టడం, వార్పు, టైయింగ్, డైయింగ్ ద్వారా డిజైన్ చేయడం, చిటికి కట్టడం, కండెలు తిప్పడం, రాట్నం వడకటం, సరి చాపుట, అచ్చులు కట్టడం ఆసుపోయడంతో పాటు మగ్గంపై వస్త్రం తయారీ ప్రక్రియలను ప్రత్యక్షంగా చూసి అబ్బురపోయారు. చేనేత కళాకారుల శ్రమ, నైపుణ్యాన్ని వారు ప్రశంసించారు. ప్రపంచ వ్యాప్తంగా పోచంపల్లికి ఉన్న బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు తాము కృషి చేస్తామన్నారు. యారన్ టూ క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్ సందర్శించి గ్యాలరీ వీక్షించారు.



నూలు వడుకుతున్న మహిళతో సుందరీమణి మాటామంతి

ఆంజనేయస్వామితో మొదలై

తూర్పు దిశలో త్రితల రాజగోపురం వద్ద దివ్య స్వర్ణవిమాన రాజగోపురం దర్శించుకొని సర్వాంగ సుందరగా పుష్పాలంకరణ చేసిన ఆలయంలోకి ప్రవేశించిన సుందరీమణులు ముందుగా క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి ధ్వజస్తంభం వద్దకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అంతరాలయంలో స్వయంభువులకు నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి ఉపాలయంలోని ఆండాళ్ అమ్మవారు, ఆళ్వార్ స్వాములను దర్శించుకున్నారు. అనంతరం గర్భాలయానికి అభిముఖంగా వేదపండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. 9మంది వనితకు లడ్డూప్రసాదం, స్వామివారి మెమోంటోలు ఆలయ డీఈవో దోర్బల భాస్కర శర్మ, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి వారికి అందజేశారు.



ధ్వజస్తంభానికి మొక్కుతున్న సుందరీమణి

గుట్టలో పర్యటన సాగిందిలా

5 గంటలకు కొండపైకి సుందరీమణులు చేరుకున్నారు.
5.40 గంటల వరకు ప్రోటోకాల్ అతిథి గృహంలో అతిథ్యం.
ఇదే సమయంలో వైటీడీఏ వైస్‌చైర్మన్ గుట్ట క్షేత్ర ప్రాముఖ్యం వివరణ
5.45 గంటలకు బ్యాటరీ వాహనాల వద్దకు చేరిక
5.49 ప్రభుత్వ విప్, అదనపు కలెక్టర్ ఘన స్వాగతం
5.50 అఖండ దీపారాధన, స్వామివారి చిత్రపటానికి మొక్కులు
5.54 తూర్పు తిరువీధుల్లో సుందరీమణుల నడక
5.57 ప్రత్యేక వేదికపై ఆగ్నేయ దిక్కులో ఫొటోషూట్
6.01 ముగిసిన ఫొటోషూట్
6.02 ఆలయంలోకి ప్రవేశం
6.04 ఆంజనేయస్వామి దర్శనం
6.08 ధ్వజస్థంభం వద్ద మొక్కులు
6.10 స్వయంభువులకు దర్శనం
6.20 ప్రత్యేక పూజలు
6.25 ఉపాలయాల సందర్శన
6.42 వేద ఆశీర్వచనం
6.45 ప్రసాదం, చిత్రపటం అందజేత
6.50 ఆలయం వెలుపలికి
6.54 అంతర్ తిరువీధిలో ఫొటోషూట్
7.00 అతిథి గృహం చేరిక
7.15 టూరిజం బస్సుల్లో తిరుగుప్రయాణం

పర్యాటక, కళల, సామాజిక చైతన్య

కాణాచి పోచంపల్లి: కలెక్టర్

ప్రపంచ వ్యాప్తంగా పోచంపల్లికి ఉన్న చారిత్రక నేపథ్యాన్ని కలెక్టర్ హనుమంతరావు వివరించారు. ఆచార్య వినోబాభావే, వెదిరె రామచంద్రారెడ్డి కృషితో అంకురించిన భూదానోద్యమం ద్వారా విశ్వ వ్యాప్తంగా భూదాన్‌పోచంపల్లిగా గుర్తింపు పొందిందన్నారు. చేనేత టైఅండ్‌డై ఇక్కత్ చిటికి పరిశ్రమకు పురుడు పోసుకున్న పోచంపల్లి నేడు సిల్క్ సిటీ ఆఫ్ పోచంపల్లిగా పేరొందిందన్నారు. పోచంపల్లి ఇక్కత్‌కు జీఐఏ ట్యాగ్ 2004లో లభించిందన్నారు. ఇటీవల యునెస్కో ద్వారా ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామంగా పోచంపల్లి అవార్డు దక్కించుకుందన్నారు.

ట్రెండ్ సెట్టర్ ఇక్కత్: ఎమ్మెల్యే

చేనత పరిశ్రమ కేవలం జీవనోపాదిగానే కాకుండా ఒక ట్రెడిషనల్ ట్రెండ్‌గా కొనసాగుతుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. చేనేత పరిశ్రమపై ఎంతోమంది ఉపాధి పొందుతున్నారన్నారు. కళాత్మక డిజైన్లు, వస్త్రాలు రూపొందించిన కళాకారులు ఈ ప్రాంతం వారన్నారు. గజం అంజయ్య, చింతకింది మల్లేశం పద్మశ్రీ అవార్డులు పొందారన్నారు. పోచంపల్లిని ప్రపంచ సుందరీమణులు సందర్శించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పోచంపల్లి చేనేత ఇమేజ్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత ప్రాచుర్యం చేయాలన్నారు. ప్రపంచదేశాలకు చేనేతలో పోచంపల్లికి సుస్థిరస్థానం కలిగేలా ప్రచారం చేయాలని ఆకాంక్షించారు.



సెల్ఫీదిగుతున్న సుందరీమణులు



మగ్గం నేస్తూ..



సందర్శిస్తూ, స్పృశిస్తూ..

ఆలయ శిల్ప కళా సౌందర్యం ప్రపంచ సుందరీమణులను ఆకట్టుకుంది. ప్రధానాలయం నుంచి ఆలయ అందాలు తిలకిస్తూ మెట్ల మీదుగా లోపలి ప్రాకార మండపాల్లోని యాలీ పిల్లర్లు, శిల్పకళా సౌందర్యాన్ని పరిశీలించారు. శిల్పకళా విశిష్టతను అధికారులు వివరించారు. శిల్పాలను స్పృశిస్తూ, తదేకంగా ఆలయ నిర్మాణాన్ని శిల్పకళా సౌందర్యాన్ని తిలకించారు. తూర్పు రాజగోపురం నుంచి పశ్చిమ రాజగోపురం చేరేసరికి సుమారు 45 నిమిషాల సమయం పట్టింది.



యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో ప్రపంచ సుందరీమణుల పర్యటన నేపథ్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. డీసీపీ అక్షాంశ్ యాదవ్ పర్యవేక్షణలో భువనగిరి ఏసీపీ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కొండపై రాచకొండ సీపీ సుధీర్‌బాబు బందోబస్తును పర్యవేక్షించారు. 10మంది బ్లాక్ కమాండర్లు, నలుగురు సీఐ, ఎనిమిది మంది ఎస్ఐలతో పాటు 150 మంది సిబ్బంది పాల్గొన్నారు.



ఆటపాటలతో సందడి

చేనేత స్టాల్స్ సందర్శన అనంతరం పార్క్ ఆవరణలో బతుకమ్మ ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ సందడిగా గడిపారు. అంతేగాక కిన్నెర వాయిద్యానికి ముగ్ధులైన సుందరీమణులు నృత్యాలు చేశారు. సుందరీమణుల నృత్యాలు, పాటలతో ఆ ప్రాంతం సంబురాన్ని తలపించింది. కొద్దిసేపటి తర్వాత చేనేత మ్యూజియాన్ని సందర్శించారు.

ఆకట్టుకున్న సంప్రదాయ వస్తువులు

పార్క్‌లో గ్రామీణ వాతావరణం సుందరీమణులను ఆకట్టుకుంది. సాంప్రదాయ ఎడ్ల బండి, పూరి గుడిసెలో ఏర్పాటుచేసిన స్టాల్ వద్ద సందడిచేశారు. సెల్ఫీలు దిగుతూ, స్టెప్పులు వేస్తూ స్థానికులనూ అలరించారు. ఆ తర్వాత హ్యాంపీ థియేటర్‌కు చేరుకున్న సుందరీమణులకు స్వాగతం పలికారు.



బ్యాటరీ కారులో ప్రయాణిస్తున్న సుందరీమణులు



కిన్నెర వాయిస్తున్న కళాకారుడి వద్ద సుందరీమణులు, పక్కన ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు



ఇక్కత్ వస్త్రాలతో మోడల్ ప్రదర్శన



● కిరాక్ ..ర్యాంప్ వాక్..

పోచంపల్లి చారిత్రక నేపథ్యం, చేనేత థీమ్‌పై, ఇక్కత్ ప్రాముఖ్యంపై దృశ్య ప్రదర్శన జరిగింది. అనంతరం ప్రముఖ క్యాస్టూమ్ డిజైనర్ జోసఫ్ సుధీర్ నేతృత్వంలో 30 మంది మోడల్స్ చేనేత ఇక్కత్ వస్త్రాలతో నిర్వహించిన ర్యాంప్ వాక్ అందరినీ అలరించింది. ముఖ్యంగా ర్యాంప్ వాక్ నిర్వహించినంత సేపు ప్రపంచ సుందరీమణులు కేరింతలు కొడుతూ ఆనందోత్సాహాలతో సందడి చేశారు. అనంతరం మోడల్స్‌ను వారు అభినందించారు. ఈ సందర్భంగా ఆహుతులకు నిర్వాహకులు, జిల్లా అధికార యంత్రాంగం చేనేత శాలువాలు, హ్యాండ్ బ్యాగులు బహూకరించారు. సాయంత్రం 5-30 గంటల నుంచి రాత్రి 8-30 గంటల వరకు ప్రపంచ సుందరీమణుల పర్యటన ప్రశాంతంగా జరిగింది. పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు నిర్వహించింది.



అదృశ్యమైన యువకుడు మృతి



జగదీష్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, మే 15,(ఆంధ్రజ్యోతి): పదిరోజుల క్రితం అదృశ్యమైన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిగుట్ట మండలంలోని చిన్న కందుకూర్ గ్రామానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో మృతిచెందాడు. గురువారం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నకందుకూర్ గ్రామానికి చెందిన ఎర్ర మల్లయ్య రెండో కుమారుడు జగదీష్(23) హైదరాబాద్ ఉప్పల్ పరిధిలోని భారత్‌నగర్ ఓయోటౌన్ సిగ్నాల్లో కొన్ని సంవత్సరాల నుంచి తన కారు అద్దెకు నడుపుకుంటూ ఉప్పల్‌లోని ఓ గదిలో నివాసముంటున్నాడు. అప్పుడప్పుడు చిన్నకందుకూర్ గ్రామంలోని తల్లి దండ్రుల వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. ఈ నెల 1వ తేదీన ఇంటికి వచ్చి వెళ్లాడు. ఐదు రోజుల వరకు ఎలాంటి సమచారం లేకపోవడంతో తన కుమారుడు జగదీష్ అదృశ్యమయ్యాడని తండ్రి మల్లయ్య ఈ నెల 5న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 12వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్కడ వెతికినా జాడ దొరకలేదు. జగదీష్ తన గదిలో మూడు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాస వస్తుండడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఉప్పల్ పోలీసుల సమాచారంతో తల్లిదండ్రులు ఉప్పల్‌కు వెళ్లారు. యువకుడి మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. జగదీష్ మృతితో చిన్నకందుకూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిలుకూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... పాలెఅన్నారం గ్రామానికి చెందిన దేశబోయిన వెంకటేశ్వర్లు బైక్‌పై హుజూర్‌నగర్ వైపు నుంచి వస్తూ తన గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతనిని చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

వలిగొండ: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి గాయపడ్డాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని అర్రూరు గ్రామానికి చెందిన జినుకల మత్స్యగిరి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఆ గ్రామ పరిధిలో ఢీకొంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వలిగొండ పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం డాక్టర్ సలహా మేరకు భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కనగల్, మే 15: (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని రాంచంద్రాపురం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన వల్కి లింగయ్య(50) ఈ నెల 4న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. భార్య సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ సైదులు తెలిపారు. కొంతకాలంగా లింగయ్య మానసిక సమస్యలతో బాధపడుతూ పురుగుల మందు తాగాడని ఫిర్యాదులో తెలిపారు. గతంలోనూ రెండు పర్యాయాలు పురుగుల మందు తాగినట్టు పేర్కొన్నారు.

రైతు వేదికలో సామగ్రి అపహరణ.. ఫిర్యాదు

నేరేడుచర్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని జానల్‌దిన్న రైతు వేదికలోని సామాగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని నేరేడుచర్ల వ్యవసాయాధికారి జావిద్ గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం రైతు వేదికను సందర్శించినప్పుడు టేబుల్, అల్మారా ఉన్నాయని, వాటిని ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. గతంలో కూడా రైతు వేదిక తలుపులు పగులగొట్టి ఫ్యాన్లు, మోటర్, ట్యూబ్‌లైట్లు, చైర్లు, కరెంటు మీటర్, వైర్లు, ఫైల్స్ ఎత్తుకెళ్లారని, స్విచ్‌బోర్డు కూడా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు.

సౌదీలో కోదాడ వాసి మృతి

పదేళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లిన తాజుద్దీన్



తాజుద్దీన్(ఫైల్)

కోదాడ, మే 15 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి షేక్ తాజుద్దీన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ శివారులోని తమ్మర గ్రామానికి చెందిన తాజుద్దీన్(48) కుటుంబం పదేళ్ల క్రితం కోదాడ పట్టణానికి వలసవచ్చి రోశమ్మగారి వీధిలో ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. తాజుద్దీన్ జీవనోపాధి నిమిత్తం భార్య, ఇద్దరు పిల్లలను కోదాడలోనే వదిలి పదేళ్ల కిత్రం సౌదీ అరేబియాలోని దమామ్ పట్టణానికి వెళ్లి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కపిల్ అనే స్నేహితుడితో కలిసి సొంతంగా కూరగాయల వ్యాపారం ప్రారంభించారు. బుధవారం దమామ్ పట్టణానికి చెందిన తాజుద్దీన్ స్నేహితులు కోదాడలో ఉంటున్న కుటుంబసభ్యులకు ఫోన్ చేసి తాజుద్దీన్ మృతిచెందినట్లు సమాచారమిచ్చారు. ఈ నెల 8వ తేదీన కపిల్‌కు, తాజుద్దీన్‌కు మధ్య ఘర్షణ జరిగిందని, ఈ నేపథ్యంలో తాజుద్దీన్‌ను హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. తాజుద్దీన్‌కు ఇంటర్ చదివే కుమార్తె, తొమ్మిదో తరగతి చదివే కుమారుడు ఉన్నాడు. రంజాన్ పండుగకు ముందు తాజుద్దీన్ కోదాడకు వచ్చి వెళ్లాడు. ఇంతలోనే అనుమానాస్పదంగా మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. తాజుద్దీన్ కుటుంబానికి ఎవరూ దిక్కులేరని, సౌదీ అరేబియా ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని, మృతదేహం ఇక్కడకు వచ్చేలా చూడాలని బంధువులు వేడుకుంటున్నారు.

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

నల్లగొండ కల్చరల్, మే 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన అండర్-25 జిల్లా జట్టు ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీనుద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు నుంచి జట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన జిల్లా జట్టు హెచ్‌సీఏ ఆధ్వర్యంలో జరిగే లీగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు సెల్: 9885717996లో సంప్రదించాలని కోరారు.

శాలిగౌరారం ప్రాజెక్టు నీటిమట్టం 13 అడుగులు

శాలిగౌరారం, మే 15(ఆంధ్రజ్యోతి): మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టులో గురువారం సాయంత్రం వరకు 13అడుగుల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు మూసీ నది ప్రవహిస్తుండడంతో పల్లివాడ మూసీ ఆనకట్ట నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు భారీగా వచ్చి చేరుతోంది. ఇప్పటికే ఫీడర్ ఛానల్ పరిధిలోని చెరువులు, కుంటలు నిండి అలుగు పోస్తున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21అడుగులకు ప్రస్తుతం 13 అడుగులకు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. మూసీనది ఇలానే ప్రవహిస్తే ఈనెల చివరి వారంలో ప్రాజెక్టు పూర్తిగా నిండి అలుగు పోస్తుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు

● ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలరూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే మొదటి ప్రాధాన్యమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి ఎంపీ గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామాల్లో ఇళ్లులేని వారిని గుర్తిస్తే ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వంలోని పాలకులు చేసిన తప్పులను అధిగమించి అవాంతరాలు లేకుండా ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధిని సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా కూడా ప్రజలకు సంక్షేమ పథకాలను విడతలవారీగా కాకుండా ఒక్కో సంక్షేమ పథకాన్ని పూర్తిస్థాయిలో అందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటోందని ఆయన అన్నారు.

వైభవంగా పవళింపు సేవ

● మట్టపల్లిలో ముగిసిన స్వామివారి బ్రహ్మోత్సవాలు

మఠంపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆరు రోజులుగా వైభవంగా కొనసాగుతున్న మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ముగిశాయి. గురువారం రాత్రి నిర్వహించిన పవళింపు సేవతో ఉత్సవాలకు ముగింపు పలికారు. అంతకుముందు ఆలయంలో ఉత్సవమూర్తులకు ఉదయం పుణ్యహావాచనం, సహస్రనామార్చన, నీరాజనమంత్రపుష్పం, అభిషేకాలు నిర్వహించారు. ఉభయ దేవేరుల భక్తవత్సలుడికి ద్వాదశ ప్రదక్షలు చేయించి ఆలయంలోకి వేంచేయించారు. అనంతరం 12 రకాల వాయిద్యాలతో దివ్యమూర్తులకు వివిధ భోగావిశేష పర్వాలు జరిగాయి. కల్యాణోత్సవాల్లో గజ, గరుడ, సింహ తదితర ద్వాదశ వాహనాలతో చేపట్టాల్సిన సేవలకు ప్రత్యామ్నయంగా అభిమంత్రించిన 12 మంది దేవతలకు ఉత్సవాలు జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే వేద, శాస్త్ర, పారాయణ, మంగళ, మౌన, భావిది క్రతువులతో అర్చనలు చేశారు. అద్దాల మండపంలో సాయంత్రం ఆరు గంటలకు స్వామివారికి ద్వాదశ సేవలు, శృంగార డోలోత్సవం, పుష్పాలంకృతమైన భోగ మండపంలో కల్యాణమూర్తులకు పవళింపు సేవ నిర్వహించారు. ఫలప్రదానం చేశారు. చతుర్వేద పారాయాణాలు, ఇతిహాస ప్రవచనాలు పూర్తయ్యాక రాజోపచారాలతో పుష్పయాగం ఏకాంత సేవలు చేపట్టారు. ఎంవీఎస్ ఆచార్యుల ఆధ్వర్యంలో సంగీత విభావరి భక్తులకు పరవశింపజేసింది. ఆయా కార్యక్రమాలను బొర్రా వాసుదేవాచార్యులు, ఆచార్య తృమున దేవాలయ అర్చకులు, వైఖానస ఆగమ పండితుల ఆధ్వర్యంలో



స్వామివారి పవళింపు సేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, అర్చకులు తూమాటి కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, లక్ష్మణాచార్యులు, బ్రహ్మాచార్యులు, రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, బదరీనారాయణచార్యులు, శేషగిరిరావు, సీతారామాచార్యులు, రాజేష్, రమేష్ దేవస్థాన పాలకమండలి సభ్యులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలకు సహకరించిన ప్రతీ ఒక్కరికి ధర్మకర్తలు, ఈవో కృతజ్ఞతలు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.13.18లక్షలు

మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహుడి హుండీ కానుకలను గురువారం మహాక్షేత్రంలో దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కించారు. ఈ ఏడాది మార్చి 27 నుంచి బుధవారం వరకు 48 రోజులకు హుండీ కానుకలు రూ.8,96,208లు, నిత్య అన్నదారం ద్వారా రూ.49,350, ఈ నెల 1 నుంచి 14 వరకు జరిగిన స్వామి వారి ఉత్సవాల్లో కల్యాణకట్నాలు ద్వారా రూ.3,72,220 మొత్తం రూ.13,18,778ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్ తెలిపారు. హుండీ కానుకల లెక్కింపును దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి టీ. వెంకటచలపతి ఆధ్వర్యంలో శ్రీసాయి సేవా సంఘానికి చెందిన 40 మంది సభ్యులతో నిర్వహించారు.

దేవాలయ రక్షణ గోడ పరిశీలన

పులిచింతల ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా మట్టపల్లి ఆలయం ముంపునకు గురి కాకుండా ఏర్పాటుచేసిన రక్షణగోడను రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోడ లీకేజీ ద్వారా ఆలయంలో ఇబ్బందులు, భక్తుల సమస్యలు, మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపై ఆలయ ధర్మకర్తలు, ఈవోలతో చర్చించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో మట్టపల్లి ఆలయాన్ని సందర్శించినట్లు రాష్ట్ర నీటిపారుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకిషోర్, అసిస్టెంట్ ఇంజనీర్ జీవన్ తెలిపారు. లీకేజీలను అరికట్టేందుకు తగు చర్యల కోసం ఆలయాన్ని పరిశీలించామన్నారు. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారలకు అందజేస్తామని వారు తెలిపారు.

రైతులకు సహకారం

(5వ పేజీ తరువాయి)

గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్తగా రూ.100కోట్ల వరకు రుణాలను నూతనంగా చేరిన సభ్యులకు ఇచ్చారు. మొత్తంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రూ.614కోట్లను పంట రుణాలుగా చెల్లించింది. గతానికి భిన్నంగా ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక లాభాలు, వ్యాపార వృద్ధి తక్కువ ఎన్‌పీఏ సాధించడంతో అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు. బంగారు రుణాల విషయంలో రూ.624కోట్లను మార్టిగేజ్ లోన్‌లను రూ. 289కోట్లు, విద్యా రుణాలు రూ. 125 కోట్లు, గొర్రెలు, మేకలకు రుణాలు రూ.189కోట్లు, డెయిరీ రుణాలు రూ.105కోట్లను, పౌల్ట్రీ రుణాలు రూ.72కోట్లు, ఇతర రుణాలు రూ.86కోట్లు.. మొత్తంగా 2024-25లో రూ.2595కోట్లు రుణాలను పంపిణీ చేశారు.

అదేవిధంగా గ్రామీణ పట్టణ ప్రాంతంలో నూతన ఇంటి నిర్మాణాలు చేసుకునే వారికి మార్టిగేజ్ ద్వారా రూ.35లక్షల వరకు ఇస్తున్నారు. గొర్రెలు, నాటుకోళ్ల పెంపకంకింద పీఎంఈజీపీ పథకం కింద పౌల్ట్రీ, డెయిరీ వ్యాపారాలకు 35శాతం సబ్సిడీతో రుణాలను అందించనున్నారు. కొత్తగా ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులకు మరిన్ని సేవలను విస్తరింపజేయడానికి మిర్యాలగూడ-2, శాలిగౌరారం, పెద్దవూర, మోతె, చిలుకూరు, నాంపల్లిలో కొత్తగా ఆరు శాఖల ఏర్పాటుకు ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

కుంభం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గం ఐక్యతతో బ్యాంకు అన్నిరంగాల్లో అభివృద్ధిని సాధించిందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం సబ్ కమిటీల సమావేశం అనంతరం బ్యాంకు వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్ రెడ్డి, డైరెక్టర్లు పాశం సంపత్ రెడ్డి, గుడిపాటి సైదులు, కొండ సైదులు, జయరాం, శ్రీనివాస్, వీరస్వామి, రామచంద్రయ్య, గిరధర్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార రుణాలపై వడ్డీ తగ్గించడం చారిత్రాత్మకమైన నిర్ణయమని, దీనిని త్వరగా అమల్లోకి తీసుకొచ్చి రైతులకు ప్రయోజనం కల్పిస్తామన్నారు. తమ పాలకవర్గం ఐకమత్యంగా బ్యాంకును బలోపేతం దిశగా నిర్ణయం తీసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3500కోట్ల వ్యాపారం, రూ.60కోట్ల ప్రాఫిట్, ఒక శాతం కన్న తక్కువ ఎన్‌పీఏ సాధించుకోవడంతో పాటు అన్ని రంగాల్లో బ్యాంకును అభివృద్ధి పథంలో తీసుకపోవడమే లక్ష్యంగా తమ పాలకవర్గం పనిచేస్తుందని తెలిపారు.

ఎయిమ్స్ వైద్య విద్యార్థి బలవన్మరణం

● యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో విషాదం

బీబీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని ఎయిమ్స్‌లో (అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ) వైద్య విద్య చదువుతున్న అభిజిత్ జాయ్ (25) ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ ప్రభాకర్‌రెడ్డి, సహచర విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళ రాష్ట్రం త్రిశోల్‌కు చెందిన పోలీస్ అధికారి బీబీ జాయ్ కుమారుడు అభిజిత్ జాయ్ (25)బీబీనగర్ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి 7గంటల సమయంలో ఎయిమ్స్ ఆసుపత్రి భవనం నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. చీకటి పడుతున్నప్పటికీ ఎంతకూ తిరిగిరాకపోవడంతో సహచర వైద్య విద్యార్థులు అభిజిత్‌కు ఫోన్ చేసినప్పటికీ సమాధానమివ్వకపోవడంతో కేరళలో ఉంటున్న తండ్రి బీబీ జాయ్‌కి సమాచారమిచ్చారు. అభిజిత్ జాయ్ ఫోన్ సిగ్నల్ హైదరాబాద్‌కు 40కిలోమీటర్ల దూరంలో ఎయిమ్స్‌కు దగ్గరలో ఓ చెరువు వద్ద సెల్‌ఫోన్ ఉన్నట్టు సిగ్నల్ తెలుస్తోందని విద్యార్థులకు సూచించడంతో వారు సమీపంలోని బీబీనగర్ పెద్ద చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. రహదారి పక్కగా ద్విచ్రక వాహనాన్ని నిలిపిఉంచి, ఆ పక్కనే సెల్‌ఫోన్, చెప్పులు ఉండడాన్ని గుర్తించి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావించి, స్థానిక ఎయిమ్స్ అధికారులకు తద్వారా స్థానిక పోలీసులకు సమాచారం చేరవేశారు. గురువారం ఉదయం తెల్లవారు జామున స్థానిక పోలీసులు గజ ఈతగాళ్ల సహకారంతో చెరువులోంచి అభిజిత్ మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా అభిజిత్ ఆత్మహత్యపై తండ్రి బీబీ.జాయ్ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు పిర్యాదు చేశారు. అభిజిత్ మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం ఏరియా ఆసుపత్రి నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం తరలించారు. వైద్య విద్యార్థి మృతికి ఆత్మహత్య లేక మరేదైనా కారణం ఉందా లేదా అనే కోణంలో విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

హతమార్చారు

● ప్రియుడితో కలిసి భర్త హత్య ● వెల్మకన్నె హత్య కేసును ఛేదించిన నల్లగొండ జిల్లా పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో ఈ నెల 10వ తేదీన జరిగిన ఈ దారుణాన్ని పోలీసులు ఛేదించారు. కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శివరాంరెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం విలేకరులకు వివరించారు. వెల్మకన్నె గ్రామానికి చెందిన వల్లపు మల్లేష్ గ్రామంలోనే ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామానికి చెందిన కూలి పనులు చేసుకునే రేవల్లి నవీన్‌తో మల్లేష్ భార్య హేమలతకు మధ్య మూడు సంవత్సరాలుగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. ఈ విషయంపై మల్లేష్ హేమలతను ప్రశ్నించడంతో పాటు నిఘా ఉంచాడు. తమ విషయం మల్లేష్‌కు తెలిసిందని అతనిని అంతమొందించాలని హేమలత, నవీన్ నిర్ణయించుకున్నారు. ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం రేవల్లి నవీన్, మల్లేష్ ఇంట్లో టైల్స్ పెట్టడానికి వచ్చాడు. తర్వాత ఇద్దరూ కలిసి మద్యం సేవించి తమ ఇళ్లలోకి వెళ్లిపోయారు. పథకం ప్రకారం నవీన్ మల్లేష్‌ను సాయంత్రం పిలిచి మళ్లీ ఫూటుగా మద్యం తాపించడంతో మల్లేష్ స్పృహ తప్పాడు. వెంటనే నవీన్ ఈ విషయాన్ని హేమలతకు ఫోన్ చేసి చెప్పాడు. అనంతరం మల్లేష్‌ను బైక్‌పై తీసుకెళ్లి ఇంటి వద్ద దింపాడు. రాత్రి 10.30 గంటలకు నవీన్ తిరిగి మల్లేష్ ఇంటికి వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న మల్లేష్ మంచంపై నిద్రిస్తున్నాడు. ఇదే అదనుగా భావించిన నవీన్, హేమలత టవల్‌తో గొంతు నులిపి మల్లేష్‌ను చంపేశారు.

ఏమీ తెలియనట్లు నాటకమాడి..

మల్లేష్‌ను హత్య చేసిన తర్వాత రక్తపు మరకలతో ఉన్న టవల్‌ను తీసుకుని నవీన్ అక్కడి నుంచి పరారై ఆధారాలను నాశనం చేయాలని చూశాడు. 11వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు హేమలత అరుపులు, కేకలు వేసి మల్లేష్ చనిపోయాడని నాటక మాడింది. కుమారుడి మృతిపై అనుమానం ఉందని 11వ తేదీన మల్లేష్ తల్లి వల్లపు వెంకటమ్మ మునుగోడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అనుమానాదాస్పద మృతిగా కేసు నమోదు చేసి 12వ తేదీన పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ చేపట్టారు. పథకం ప్రకారమే మల్లేష్‌ను హేమలత, నవీన్ హత్య చేశారని తేవడంతో విచారణ అనంతరం ఈ నెల 14వ తేదీన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గురువారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రెండు మొబైల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో కేసును ఛేదించిన చండూర్ సీఐ ఆదిరెడ్డి, గట్టుప్పల్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ ఆర్. అంజయ్య, సిబ్బంది రమేష్‌ను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి



బోల్తాపడిన ఆటో, సుధాకర్ మృతదేహం

వలిగొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని అక్కంపల్లి గ్రామ శివారులో గురువారం జరిగింది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా రఘునాథ్‌పల్లి మండలంలోని కంచెనపల్లికి చెందిన లాడే సుధాకర్, అంజాజి వాహన బ్యాటరీల వ్యాపారం నిమిత్తం ఆటోలో చౌటుప్పల్‌కి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. వలిగొండ మండలం అక్కంపల్లి గ్రామ పరిధిలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుధాకర్(40) అక్కడికక్కడే మృతిచెందాడు. అంజాజికి తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రి తరలించారు.

ఆటో బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

చిలుకూరు: ట్రాలీ ఆటో అదుపు తప్పి బోల్తా పడి ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలకేంద్రంలో గురువారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన కొందరు కొంతకాలంగా కోదాడలో ఉంటున్నారు. చిత్తు కాగితాలు ఏరుకుంటారు. గురువారం ట్రాలీ ఆటోలో కోదాడ నుంచి హుజూర్‌నగర్‌కు వెళ్తుండగా చిలుకూరు వద్ద ఆటో అదుపు తప్పింది. దీంతో ఆటోలో ఉన్న ప్రియాంక, నాగరాజు, వెంకటరమణ, పూజిత, జంపన్న, శివ, సత్యంలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం కోదాడ వైద్యశాలకు తరలించారు. ఆటో పక్కకు పోవడంతో అక్కడ ఉన్న గేదెకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధిత రైతు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రాణం తీసిన చేపల వేట



రోదిస్తున్న నాగార్జునరెడ్డి భార్య పిల్లలు

కనగల్ మే 15: (ఆంధ్రజ్యోతి): చేపల వేట ప్రాణం తీసింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని పగిడిమర్రి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రైతు అబ్బిడి నాగార్జునరెడ్డి(35) నల్లగొండలో నివాసముంటూ సొంతూరు పగిడి మర్రిలో పొలంలో వ్యవసాయ పనులు చూసుకుంటాడు. గురువారం ఉదయం పగిడిమర్రిలోని తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి అటునుంచి పొలం వద్దకు వెళ్లాడు. మరమ్మతుల్లో ఉన్న వ్యవసాయ బోరు మోటర్ పైపులను స్థానికుల సాయంతో బయటికి లాగాడు. పొలం పక్కనే కుంటలోకి మరో వ్యక్తితో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లాడు. కుంటలో చేపల వల పరుస్తున్న క్రమంలో నాగార్జునరెడ్డి నీటిలో మునిపోయాడు. నీటిలో మునిగిపోతున్న నాగార్జునరెడ్డిని ఆ వ్యక్తి బయటికి లాగే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. అతడు చుట్టుపక్కల వారికి విషయాన్ని తెలపగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో నాగార్జునరెడ్డి కోసం కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. ఎంతకూ జాడ తెలియకపోవడంతో ఫైర్ సిబ్బందిని పిలిపించగా వారు కొక్కెంల సాయంతో కుంటలో నాగార్జునరెడ్డి మృతదేహాన్ని బయటికి తీశారు. తహసీల్దార్ పద్మ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాగార్జునరెడ్డి కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేస్తామని ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపారు. నాగార్జునరెడ్డి ఆయన తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు కావటంతో వారి రోదనలు మిన్నంటాయి. నాగార్జునరెడ్డికి భార్య, కూతురు కుమారుడు ఉన్నారు.



నాగార్జునరెడ్డి మృతదేహం

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నాగార్జునసాగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని కొత్తవంతెన వద్ద గుర్తుతెలియని మృతదేహం లభించింది. సాగర్ ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ కొత్త వంతెనకు ఎడమ వైపున సుమారు 40సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. నీటిలో పడి కనీసం మూడు రోజులు అయి ఉండొచ్చని, మృతదేహం ఉబ్బి గుర్తు పట్టలేని విధంగా ఉందని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో సీట్లకోసం ఘర్షణ

యాదగిరిగుట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు యాదగిరికొండకు వచ్చిన భక్తులు గురువారం ఆర్టీసీ మినీ బస్సులో సీట్ల కోసం పోటీ పడడంతో ఘర్షణ జరిగింది. మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో బస్సు ఎక్కే సమయంలో రెండు కుటుంబాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఎస్పీఎఫ్ సిబ్బంది సర్దిచెప్పారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మోత్కూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో గురువారం జరిగింది. జినుకల ఉపేందర్‌కు చెందిన సుమారు రూ.80వేల విలువ కలిగిన ఎద్దు గురువారం బిక్కేరు వాగు పక్కన జినుకల వారి బావి వద్ద మేతకు వెళ్లింది. మేత మేస్తూ అక్కడున్న జంట ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్త్‌వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టు రక్షణ కంచె లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనులలో భాగంగా శుక్రవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు 11 కేవీ బస్టాండ్ ఫీడర్ పరిధిలోని గవర్నమెంట్ ఆస్పత్రి, సతీష్‌నగర్, డాక్టర్స్ కాలనీ, అన్సారీ కాలనీ, బస్టాండ్ ఎదురుగా, దారుషపా కలాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఎం ఎం.వేణుగోపాలాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధం

కనగల్, మే 15 (ఆంధ్రజ్యోతి): కనగల్ ఆగ్రోస్ ఎరువుల దుకాణంలో, పర్వతగిరి ఎన్‌డీఎంఎస్‌లో సబ్సిడీ కింద జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏవో అమరేందర్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో బస్తా 30కిలోలు కాగా రూ.2138కు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాపాస్ పుస్తకాల జీరాక్స్‌లను తీసుకొచ్చి విత్తనాలు పొందాలన్నారు. చర్లగౌరారం, చెట్లచెన్నారం, పగిడిమర్రి రైతులు పర్వతగిరిలో తీసుకోవాలని సూచించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

నార్కట్‌పల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం సప్తమ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మంటపంలో వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మల కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. సిద్ధాంతి బేతోజు సత్యనారాయణశాస్త్రి, దేవాలయ అర్చకుడు ఉత్తరాపల్లి అనంతాచార్యుల యాజ్ఞీకంలో వీరబ్రహ్మేంద్ర గోవిందమ్మ కల్యాణతంతు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవాలయ చైర్మన్ చొల్లేటి బ్రహ్మాచారి,సుభద్ర దంపతులు, గడగోజు కనకాచారి, రమాదేవి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా సంకోజు వాసు, ఉమ దంపతులు అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పెందోట సోమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నకిరేకల్ ఎస్ఐ గడగోజు కృష్ణమాచారి, విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా గౌరవాధ్యక్షుడు కొండూరు కృష్ణమాచారి, బుగోజు రామలింగాచారి, గుంటోజు రమేష్, చొక్కళ్ల పుష్పగిరి, పెందోట బిక్షమాచారి, కంచర్ల జానాచారి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



ఆర్డీవో శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

గట్టుప్పల్, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతంపేట గ్రామంలో గల నిరుపేదలందరికీ ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం అన్నారు. సీపీఎం, సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో గురువారం చండూరులో ఆర్డీవో శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూమిలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎంతోమంది పేదలు పూరి గుడిసెలోనే ఉంటున్నారని, ప్రభుత్వం వారిని గుర్తించి వెంటనే నూతన ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఆర్డీవోను కోరారు. పేదల అభ్యున్నతికి కమ్యూనిస్టులంతా ఐక్యంగా ముందుండి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, సీపీఎం మండల కార్యదర్శి రమేష్, నాయకులు ఐతరాజు లక్ష్మయ్య, నరసింహ, పెంటయ్య, సైదులు, కోటమ్మ, సత్తమ్మ, నరసింహ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కట్టంగూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు కోరారు. కట్టంగూరులో గురువారం ఆయన సమ్మె పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఆశా వర్కర్లు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో 20 సంవత్సరాలుగా కీలకభూమిక పోషిస్తున్నారని, వారికి కనీస వేతనం అందడం లేదన్నారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలపై జరిగే సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సులోచన, రామకృష్ణ, లింగయ్య, అక్బర్ సలీం, లక్ష్మీనారాయణ, శ్రీను, జానకి పాల్గొన్నారు.

నర్సరీలను సంరక్షించుకోవాలి

కట్టంగూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకొని నర్సరీలను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ వాటిని సంరక్షించుకోవాలని డీఆర్‌డీవో పీడీ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కురమర్తి గ్రామంలో ఉన్న నర్సరీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను ఏడు విభాలుగా విభజించి బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంబంధిత నర్సరీల్లో గ్రేడింగ్ పనులు చేయించాలని, జూన్ చివరి వారం వరకు నర్సరీలోని మొక్కలు రెండున్నర నుంచి మూడు ఫీట్ల వరకు ఎదిగేలా చూడాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు రూ.307 తగ్గకుండా కూలీ వచ్చేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ బీఎల్ నర్సింహారావు, ఎంపీవో చలపతి, ఏపీవో కడియం రాంమోహన్, ఏపీఎం సైదులు, కార్యదర్శులు పెద్దయ్య, జయసుధ, శేఖర్, ఈసీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పహల్గాంలో ఉగ్రదాడి

- సీపీఐ సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డి



సమావేశం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఆదిరెడ్డి

కనగల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిఘా వైఫల్యంతోనే పహల్గాంలో ఉగ్రదాడి జరిగిందని సీపీఐ సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డి అన్నారు. కనగల్‌లో గురువారం నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ సార్వభౌమత్వానికి విఘాతం కలిగించే ఉగ్రవాదుల చర్యలను ఉపేక్షించ వద్దని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. నిత్యావసర వస్తువలపై జీఎస్టీ చార్జీలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై భారం వేస్తుందని ఆరోపించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు సీపీఐ జెండాను ఆదిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గంట సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా దోటి పాండారి, సభ్యులుగా జోగు సురేందర్, నాగమ్మ, నర్సింహ, రాంకోటి, జినుకుంట్ల ఆంజనేయులు, వెలుగు వెంకటేశం ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు పల్లా దేవేందర్‌రెడ్డి, పబ్బు వీరస్వామి, జినుకుంట్ల సోమయ్య, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విలేజ్ పోలీస్ ఆఫీసర్‌గా వెంకటేశ్వర్లు

కట్టంగూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టంగూరు పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బోడ వెంకటేశ్వర్లు జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పోలీస్ అధికారి అవార్డు అందుకున్నారు. గురువారం నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ అవార్డు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ బోడ వెంకటేశ్వర్లు కట్టంగూరు మండలంలోని బొల్లేపల్లి గ్రామ పోలీస్ అధికారిగా పనిచేస్తున్నారు. ఉత్తమ అవార్డు అందుకున్న వెంకటేశ్వర్లును కట్టంగూరు ఎస్ఐ రవీందర్ అభినందించారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

- నివాసాల మధ్యే మురుగునీరు
- పందుల సంచారం.. దోమల బెడద
- దుర్వాసన.. దుర్గంధంతో అనారోగ్యం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ఖాళీ ప్లాట్ల స్థలంలో చేరిన మురుగునీరు తయారైన మురికి కూపం

నార్కట్‌పల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారింది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక నార్కట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధి 4వ వార్డులోని కొన్ని నివాస సముదాయాల మధ్య వ్యర్థపు నీరు చేరి మురికి కూపంలా మారింది. దీంతో దుర్గంధం, దుర్వాసనలతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురుగునీటిలో పందులు సంచరిస్తుండటంతో దుర్గంధం పెరుగుతోంది. దోమలు కుప్పలు కుప్పలుగా పెరుగుతున్నాయి. అనారోగ్యం బారిన పడతామనే భయం ఒక వైపు ఉండగా ఇంకిన మురుగునీరు పునాదుల్లోకి చేరి ఎక్కడ ఇళ్లకు నష్టం కలుగుతుందేమోనని స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నార్కట్‌పల్లి పట్టణంలోని 4 వార్డులోని ఓ వాటర్ ప్లాంట్ పక్కనే షట్టర్లతో పాటు ఖాళీ ఇంటి స్థలాలు ఉన్నాయి. అయితే మెయిన్ రోడ్డుకు ఉన్న కల్వర్టు (మోరీ) ద్వారా ఎగువన ఉన్న నివాసాలు, ఫంక్షన్ హాళ్ల నుంచి వచ్చే మురుగునీరు ఈ రోడ్డు కల్వర్టు ద్వారా వచ్చి ఖాళీ ప్లాట్ల స్థలంలో చేరి మురికికూపంలా తయారైంది. వాస్తవానికి అక్కడ చేరిన మురుగు నీరు దిగువకు వెళ్లాల్సి ఉంది. కానీ పట్టణీకరణలో భాగంగా కట్టిన నిర్మాణాలు అడ్డంగా ఉండటం, దీనికి తోడు మాజీ వార్డు సభ్యుడు ఇంటి నుంచి అయ్యప్ప కాలనీకి వెళ్లే దారి విషయంలో ఏర్పడిన వివాదం అపరిష్కృతంగా ఉండటంతో డ్రైనేజీ నిర్మాణానికి ఆటంకంగా మారింది. వేసవికాలంలోనే నీరు చేరి పరిస్థితి ఇలా ఉంటే వర్షాకాలంలో తమ నివాసాలు మునిగిపోవడం ఖాయమనే ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించాలని ఎమ్మెల్యే చెప్పినా ఫలితం లేదని వాపోతున్నారు.

డ్రైనేజీని వెంటనే ఏర్పాటు చేయాలి



ఇళ్ల సముదాయం మధ్యలో మురుగు నీరు చేరి నానా ఇబ్బందులు పడుతున్నాం. డ్రైనేజీ లేక ఎగువ నుంచి వచ్చే మురుగునీరంతా మా ఇంటి సముదాయం పక్కనే చేరుతోంది. గతంలో ఇదే దారిలో వచ్చే మురికి నీరు పోవడానికి ఉన్న డ్రైనేజీ ఇప్పుడెందుకు లేదో అధికా రులు పరిశీలించాలి. ప్రత్యామ్నాయ డ్రైనేజీని నిర్మించాల్సిన బాధ్య త గ్రామ పంచాయతీ అధికారులపై ఉంది. తక్షణమే స్పందించి డ్రైనేజీ నిర్మించి సమస్యకు పరిష్కారం చూపాలి.

- పన్నాల గోపాల్‌రెడ్డి, బాధితుడు

సమస్యను పరిష్కరిస్తాం



గోపాల్‌రెడ్డి నివాస సముదాయం వద్ద వ్యర్థనీరు చేరి మురికికూ పంగా మారిన సమస్య వాస్తవమే. అయితే రోడ్డు విస్తరణలో భాగంగా డ్రైనేజీ నిర్మాణం చేయాల్సి ఉంది. దీనికి తోడు అజీజ్ ఇంటికి వెళ్లే దారి వివాదం ఇంకా పరిష్కారం కాని కారణంగా ఇక్కడ లింకు డ్రైనేజీ నిర్మించలేకపోతున్నాం. గత వర్షాకాలంలో రోడ్డు మోరీ ద్వారా నీరు చేరి ఇళ్లు నీట మునిగే పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా తాత్కాలిక డ్రైనేజీ తవ్వి నీటిని దారి మళ్లించాం. స్థానికులు, తమ పైఅధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమ స్య పరిష్కారానికి కృషి చేస్తా.

- సుభాన్, పంచాయతీ కార్యదర్శి

కంపోస్టు ఎరువుల తయారీలో నిర్లక్ష్యం తగదు

- జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య

మర్రిగూడ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో సేకరించిన పొడి, తడిచెత్త వర్మి కంపోస్టు ఎరువుల తయారీలో నిర్లక్ష్యం తగదని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, దేవరకొండ డివిజనల్ పంచాయతీ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలోని సెగ్రిగేషన్ షెడ్‌లో బుధవారం వర్మి కంపోస్టు ఎరువుల తయారీ చేశారు. మర్రిగూడ, నాంపల్లి, చింతపల్లి మండలాల ఎంపీవోలు గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ వర్మి కంపోస్టు ఎరువుల తయారీ చేయడం వల్ల రైతులకు వ్యవసాయానికి ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. తయారు చేసి వర్మి కంపోస్టు ఎరువులు రైతులకు విక్రయించవచ్చని సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీకి దీని వల్ల ఆదాయం కూడా వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మర్రిగూడ ఎంపీడీవో మున్న య్య, రవి కుమార్, ఝాన్సీ, యూసుఫ్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య

సీఎంఆర్‌ఎఫ్ పథకం నిరుపేదలకు వరం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండరూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేద ప్రజలకు వరం లాంటిదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 37 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సంవత్సరానికి సుమారు రూ.1000 కోట్లకు పైన నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇది నిరుపేదలకు ఆసరాగా నిలుస్తుందని అన్నారు. పార్టీలకతీతంగా సీఎంఆర్‌ఎఫ్ పథకం ఇవ్వడం హర్షించదగిన విషయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు నిధులు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

వెలిమినేడులో నైట్‌హాల్ట్ బస్సు ప్రారంభం

- ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం



నైట్‌హాల్ట్ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

చిట్యాలరూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రవాణా సౌకర్యార్థం వెలిమినేడుకు నైట్‌హాల్ట్ బస్సును ప్రారంభించినట్లు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు- దిల్‌సుఖ్‌నగర్ నైట్‌హాల్ట్ బస్సును గురువారం ఎంపీ, ఎమ్మెల్యేలు జెండా ఊపి ప్రారంభించారు. ఇరువురు స్థానిక నాయకులు బస్సు ఎక్కి టికెట్ తీసుకొని గ్రామపంచాయతీ నుంచి జడ్పీహెచ్‌ఎస్ వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ గతంలో వెలిమినేడు నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు నైట్‌హాల్ట్ బస్సు ఉండేదని దానిని పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరినట్లు తెలిపారు. వెలిమినేడుకు నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తే చౌటుప్పల్‌తో పాటు హైదరాబాద్ వెళ్లేందుకు ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని, బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి చర్చించినట్లు తెలిపారు. స్పందించిన ఆయన వెలిమినేడుకు నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కల్పించిందని, బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం రేవంత్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దిల్‌సుఖ్‌నగర్ డిపో అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్. పావని, బుచ్చిరెడ్డి, ఎంవీఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ రాజీవ్ సత్యనారాయణ, కళాకారులు

నల్లగొండ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ రవీంద్రనగర్ బ్రాంచ్ మేనేజర్ పీడీవీ రాజీవ్‌సత్యనారాయణ అన్నారు. నల్లగొండ ఎస్‌బీఐ ఆర్ఎం అలిముద్దీన్ ఆదేశాల మేరకు నల్లగొండ పట్టణంలో సైబర్ నేరాలపై నిర్వహించిన కళాజాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోజు రోజుకు సైబ ర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రజ లు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దని సూచించారు. ఏదైన సమస్య వస్తే వెంటనే పోలీసులకు, బ్యాంకు అధికారుల సహాయ స హకారాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నల్లగొండ టౌన్ బ్రాంచ్ మేనేజర్ నరేష్, ఎస్‌బీఐ బీసీ పాయింట్ నిర్వాహకుడు ఎస్‌కే కలిముద్దీన్, కళాకారులు ఎం. చిరంజీవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్ పట్టణంలోని 1వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మే 15(ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మునిసిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ. 70 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నకిరేకల్ మునిసిపాలిటీని సుందరీకరణ చేసేందుకు రూ.70లక్షల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో నకిరేకల్‌లోని కొన్ని వార్డుల్లో అస్తవ్యస్తంగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నకిరేకల్ పట్టణంలో రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతామని, ప్రతీ పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ చెవుగోని రజితశ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, కౌన్సిలర్లు కందాళ భిక్షంరెడ్డి, గాజుల సుకన్య శ్రీనివాస్, మట్టిపల్లి కవిత, యాసారపు లక్ష్మీవెంకన్న, పోతుల సునీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

నేర్చుకున్న అంశాల్లో రాణించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి



ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఈవో భిక్షపతి

నల్లగొండ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): నేర్చుకున్న అంశాల్లో రాణించాలని డీఈవో భిక్షపతి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని బోయవాడ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన రైజింగ్ ఇండియా వేసవి శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి డీఈవో భిక్షపతి ముఖ్యఅతిథిగా హాజరై 15 రోజులపాటు శిక్షణ పొంది ప్రతిభ కనబర్చిన బాలబాలికలకు ప్రశంసాపత్రాలను అందచేశారు. మే 1న ప్రారంభమైన ఈ శిక్షణా శిబిరం చిత్రలేఖనం, చెస్, క్యారమ్, క్రాఫ్ట్, యోగా వంటి అంశాలలో 120 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. కార్యక్రమంలో నాగార్జున సాగర్ బాలభవన్ పర్యవేక్షకుడు పాలబిందల బాలు, శిక్షకులు ఉపేంద్రాచారి, సహదేవ, లలిత, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి సాంకేతికతను జోడించాలి



నార్కట్‌పల్లిలో డ్రోన్స్ షోరూంను ప్రారంభిస్తున్న లెక్కల సంతోష్‌రెడ్డి

నార్కట్‌పల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికతను, అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి దిగుబడి సాధించాలని విఘ్నేశ్వర డ్రోన్స్ సంస్థ చైర్మన్ లెక్కల సంతోష్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర డ్రోన్స్ నూతన షోరూంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి వ్యవసాయ పనుల్లో వినియోగించుకోవడం ద్వారా రైతులకు సమయం పొదుపు కావడంతో పాటు రసాయన మందులను కూడా నిర్ణీత మోతాదులో వాడే అవకాశం ఉంటుందని అన్నారు. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో తమ బ్రాంచీలు ఉన్నాయని, నార్కట్‌పల్లిలో ఏర్పాటు చేసిన నూతన బ్రాంచ్‌ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సందీప్‌రెడ్డి, సాయిశేఖర్‌రెడ్డి, రమేష్, జానీ, నవీన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ

అంబేడ్కర్ యువజనసంఘం కన్వీనర్‌గా ఆంజనేయులు

దేవరకొండ, మే 15(ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్ యువజన సంఘం దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్‌గా కొండభీమనపల్లికి చెందిన ఎర్ర ఆంజనేయులును నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అవిలయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అంబేడ్కర్ ఆశయాలను, ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు..

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

మిర్యాలగూడ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాలకు మిర్యాలగూడ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపిస్తున్నట్లు డీఎం రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడలోని కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కాళేశ్వరం సరస్వతీ పుష్కర స్నానాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం శుక్రవారం నుంచి ఈ నెల 26వ వరకు స్పెషల్ బస్సులు నడిపిస్తామన్నారు. పెద్దలకు రూ. 1,500, పిల్లలకు రూ. 800 చార్జీ వసూలు చేస్తామని తెలిపారు.

వాడపల్లికి తాగునీటిని అందించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దామరచర్ల, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లి గ్రామ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు తొలగించడానికి వారం రోజుల్లో పైపులైన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వాడపల్లి గ్రామంలో ఆయన మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎలక్ట్రికల్ అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసు కున్నారు. గ్రామంలో విద్యుత్ సమస్య రాకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. తాగునీటి కోసం పైప్ లైన్లు, మోటార్లు ఏర్పాటు చేయాలన్నారు. శివాలయంలో, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల పరిసరాల్లో పార్కింగ్ స్థలంలో మట్టి పోయించి లెవల్ చేయాలని, నిరుపేద కుటుంబాల వివాహ శుభకార్యాలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. పరిసరాలను శుభ్రం చేయాలని, గంగమ్మతల్లి ఆలయ పరిసరాల్లో కూడా మట్టితో లెవల్ చేయిచాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చందంపేట తహసీల్దార్‌గా శ్రీధర్‌బాబు

చందంపేట, మే 15(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా శ్రీధర్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీధర్‌బాబు పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. మం డలంలో సమస్యలపై దృష్టి సారించి త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పెద్ద అడిశర్లపల్లి తహసీల్దార్‌గా విజయశ్రీ

పెద్దఅడిశర్లపల్లి : మండలం తహసీల్దార్‌గా వి. జయశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్‌రావు నల్లగొండ కలెక్టరేట్‌కు అటాచ్ చేశారు. ఈ సందర్భం గా ఉప తహసీల్దార్ శివశంకర్, ఆర్ఐ శ్రీను, కార్యాలయ ఉద్యోగులు తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ..మండలవాసులకు మెరుగైన సేవలనుఅందిస్తానని ఆమె అన్నారు.

ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలక్ష్మి

దేవరకొండ, మే 15(ఆంధ్రజ్యోతి): విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలని దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మి కోరారు. మండలంలోని కొండభీమనపల్లి రైతువేదికలో గురువారం దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి మండలాల ఎరువుల దుకాణాల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు చేసిన రైతులకు రసీదు ఇవ్వాలన్నారు. స్టాక్ రిజిస్ట్రార్ ఏర్పాటు చేసుకోవాలని కోరా రు. నిబంధనలు ఉల్లంఘిస్తే తనిఖీలు జరిపి డీలర్లపై చర్యలు చేపడుతామన్నారు. సమావేశంలో దేవరకొండ, డిండి, నేరేడుగొమ్ము, చందంపేట మం డలాల వ్యవసాయశాఖ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి

కొండమల్లేపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కొండమల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెండ్లిపాకల గ్రామపంచాయతీ పరిధిలోని బాబ్ల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఇటీవల కలెక్టర్ కొనుగోలు కేంద్రానికి వచ్చి పలు సూచనలు చేయడంతో ఈ మేరకు రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించాలని సూచించారు. లారీల సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటారని రైతులకు తెలియజేశారు. ఆయన వెంట సీఈవో తిరుపతిరెడ్డి, రైతులు ఉన్నారు.

బుద్ధ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ, మే 15(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా ముధోల్ బీరాగాం గ్రామంలో దళితులపై దాడి చేసి, బుద్ధ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘ నేతలు వస్కుల మట్టయ్య, డా.జాడిరాజు, పరశురాములు అన్నారు. ఈ మేరకు గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది కాలంగా బీరా గాంలో బుద్ధిస్టులు బుద్ధ పౌర్ణమి రోజున బుద్ధ విగ్రహం నెలకొల్పేందుకు స్థానిక పెద్దలను, అధికారులను సంప్రదించి ఈ నెల 12న బుద్ధపౌర్ణమి రోజున పూజలు నిర్వహిస్తుండగా గ్రామంలోని కొందరు అగ్రకుల దురంహంకారులు దాడిచేసి గాయపరిచారని అన్నారు. కార్యక్రమంలో మాడుగుల శ్రీనివాస్, కాంతయ్య, తాళ్లపల్లి రవి, దారం మల్లేష్, శ్రీను పద్మయ్య, అంజయ్య, మల్లయ్య పాల్గొన్నారు.



డీఏవోకు వినతిపత్రం అందజేస్తున్న వివిధ సంఘాల నేతలు

దామరచర్లలో కొత్త మార్కెట్‌కు ఏర్పాట్లు

● ప్రతిపాదనలు పంపిన అధికారులు ● పలు గ్రామాల రైతులకు తగ్గనున్న దూరభారం

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

మిర్యాలగూడ నియోజకవర్గంలో అవంతీపురంలోని వ్యవసాయ మార్కెట్‌ను పునర్విభజించి దామరచర్ల మండల కేంద్రంలో కొత్త వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. దామరచర్లతో పాటు నూతనంగా ఏర్పాటైన అడవిదేవులపల్లి మండల రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలనే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ప్రభుత్వం సూచనప్రాయంగా అంగీకారం తెలిపినట్లు సమాచారం. త్వరలోనే ప్రభుత్వం పూర్తి స్థాయి అనుమతులు వచ్చే అవకాశం వుంది.

ధాన్యం రవాణా ఇక్కట్లు తొలగేలా..

దామరచర్ల మండలంలో 23,500 మంది రైతులు 22,700 ఎకరాలు సాగు చేస్తున్నారు. 16 వేల ఎకరాల్లో ప్యాడీ, 6 వేల ఎకరాల్లో పత్తి, 700 ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగుచేస్తున్నారు. అడవిదేవులపల్లి మండలంలో 6,700మంది రైతులు సుమారు 12 వేల ఎకరాల్లో పత్తి, వరి, మిర్చి, వేరుశనగ పంటలతో పాటు రెండు, మూడు వంద ఎకరాల్లో పండ్ల తోటలు సాగుచేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మిర్యాలగూడ మార్కెట్‌కు తరలించాలంటే సుమారు 30 కి.మీ దూరం ప్రయాణించాల్సివస్తుందని రైతులు ఆ రోపిస్తున్నారు. మిల్లులకు రవాణా చే యాలన్నా ట్రాక్టర్లకు అధిక చార్జీలు చెల్లించాల్సి వస్తోందని అంటున్నారు. మార్కెట్ ఏర్పాటు వల్ల రైతులకు ధాన్యం విక్రయాలు సులభతరం అవుతుందని అంటున్నారు. మార్కెట్ యార్డ్‌తో పాటు ధాన్యం నిలువ చేసుకునేందుకు గోదాములను సైతం నిర్మిస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ యార్డు

రవాణా ఇబ్బందులు తొలగుతాయి



మండల కేంద్రంలో మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల అనేక ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది. రవాణా చార్జీలు భా రం తగ్గుతుంది. తక్కువ సమయంలో ధాన్యం మార్కెట్ కు తరలించే అవకాశం ఉంటుంది.

-కందుల బాలకృష్ణారెడ్డి, రైతు, దామరచర్ల

రైతులకు ప్రయోజనం



ఉమ్మడి దామరచర్ల మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు వరి ధాన్యం పండిస్తున్నారు. ప్రతి పంట సీజన్‌లో సుమారు 4000 టన్నులకు పైగా వరిధాన్యం దిగుబడి వస్తుంది. అత్యధికంగా గిరిజన రైతులు ఉన్న ప్రాంతంగా గుర్తించి, రవాణా ఇబ్బందులు తొలగించి రైతులకు మేలు కలిగేలా దామరచర్లలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం

- వెంకటేశ్వర్లు, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి

వృత్తి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి

● శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ● మిర్యాలగూడ రెడ్డి సంక్షేమ సంఘం భవనానికి రూ. 30 లక్షల నిధులు

మిర్యాలగూడ, మే 15(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట ్టణంలో చేపట్టిన రెడ్డి సంక్షేమ భవన్‌ను పూర్తి చేసి నిరుద్యోగులు, మహిళలు, రైతులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. నల్లగొండలోని ఆయన నివాసంలో గురువారం మిర్యాలగూడలో నిర్మిస్తోన్న రెడ్డి సంక్షేమ భవన్‌కు రూ. 30 లక్షల మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీని సంఘం నాయకులకు అందజేశారు. గతంలో ఆయన ఈ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. కాగా ఆ నిధులతో భవనం, స్లాబు, గోడలను నిర్మించారు. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణం పూర్తి చేసేందుకు మరో రూ. 30 లక్షల నిధులను మంజూరు చేస్తూ ఆయన ప్రొసీడింగ్ కాపీని అందజేస్తూ మాట్లాడారు. సంక్షేమ భవన్‌ను విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్ది మిర్యాలగూడ పరిధిలోని నిరుద్యోగులు, మహిళలు, రైతులకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు వచ్చే యువతీ, యువకులకు వసతి కల్పించే విధంగా చర్యలు చేపడితే మంచిదని అన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మండలి చైర్మన్‌కు పూలబొకే అందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు అనుముల మధుసూదన్‌రెడ్డి, నాయకులు నూకల హన్మంతరెడ్డి, పాప చెన్నారెడ్డి, నామిరెడ్డి నర్సింహరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఎరమాద వెంకట్‌రెడ్డి ఉన్నారు.



మండలి చైర్మన్ గుత్తాకు బొకేతో అందిస్తున్న రెడ్డిసంఘం నాయకులు

ఫ్లెక్సీలతో ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు : కమిషనర్

మిర్యాలగూడ టౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. పట్టణంలోని పలు రహదారులపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గురువారం మునిసిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు, వేడుకలు, ఇతర కార్యక్రమాలకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకునే రాజకీయ పార్టీలు, సంఘాలు, సంస్థలు 24 గంటల అనంతరం వాటిని తొలగించాలన్నారు. వ్యాపార, వాణిజ్య ప్రకటనల కోసం ఏర్పాటు చేసే ఫ్లెక్సీలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. భారీ హోర్డింగులు, మేడలపై ఏర్పాటు చేసే బోర్డులతో ప్రమాదముంటుందని, ఏర్పాటు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయనవెంట మునిసి పల్ అధికారులు కట్టెబోయిన అంజయ్య, వెంకటరమణ, చరణ్‌తేజ్, శ్వేత తదితరులున్నారు.



గుంటూరు రోడ్డులో ఫ్లెక్సీలు తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

కొందరి ఫ్లెక్సీలనే తొలగించడం సరికాదు

మునిసిపల్ సిబ్బంది పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని బీజేపీ జిల్లా కార్యదర్శి బంటు గిరి ఆరోపించారు. గురువారం మునిసిపల్ కార్యాలయం ఎదుట మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం సబబేనని, అయితే ఏర్పాటు చేసిన గంట వ్యవధిలోనే తమ ఫ్లెక్సీ తొలగించారన్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తెచ్చేందుకు కార్యాలయానికి రాగా స్పందన లేదన్నారు. నిబంధనలంటూ కొందిరి ఫ్లెక్సీలను తొలగించడం సరికాదన్నారు. ఆయనవెంట నాయకులు బంటు గిరి, మూల రాజిరెడ్డి, వెంకటరమణ తదితరులున్నారు.

గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం



శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేసి చూపుతామని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. గురువారం మిర్యాలగూడలోని ఎమ్మెల్సీ నివాసంలో రాష్ట్ర గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాలు మాట్లాడే గోర్‌బోలి భాషను జాతీయ భాషగా గుర్తించాలని అసెంబ్లీలో కాంగ్రెస్ తీర్మాణం చేసి కేంద్రానికి పంపిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి గిరిజనుల పాత్ర కీలకమైందన్నారు. గిరిజన సమస్యలపై పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు టీఆర్‌జీఎస్ రాష్ట్ర శిక్షణ తరగతులకు హాజరై అనేక అంశాలపై జరిగే చర్చల్లో పాల్గొని సమస్యలను అధ్యయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌జీఎస్ వ్యవస్థాపకుడు రవినాయక్, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కుర్ర శంకర్ నాయక్ ,రమావత్ నరేష్ నాయక్, భాగ్యానాయక్, అఖిల్ నాయక్, సేనావత్ అశోక్, వినోద్ పాల్గొన్నారు.

లింగయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

వేములపల్లి : ప్రజా సమస్యలే ఎజెండాగా తనదైన శైలిలో పోరాడిన ప్రజా కవి పాలిశెట్టి లింగయ్య ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం లింగయ్య 13వ వర్ధంతి సం దర్భగా మండలంలోని సల్కునూరు క్రాస్ రోడ్డు వద్దగల లింగయ్య స్మారక స్థూపానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, గడ్డం శ్రీనివాస్, గుంటోజు నాగరాజు, జెర్రిపోతుల సైదులు, కళాకారులు అంకెపాక కోటేష్, బచ్చలకూరి శ్రీనివాస్, వేముల శ్రావణ్, వేణు, నల్ల శ్రీనివాస్, శోభన్ బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి

వేములపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, సీఐటీయూ మండల కన్వీనర్ కోడిరెక్క వెంకన్న కేంద్ర ప్రభుత్వాన్ని గురువారం డిమాండ్ చేశారు. ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గోడపత్రికను హమాలీ వర్కర్స్‌తో కలిసి వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నో పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న అనేక హక్కులను కాలరాసేందుకే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆమె అన్నారు. దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో కర్ష కులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, వడ్డెగాని సైదులు, నారాయణరెడ్డి, జానకీరాములు, నరేష్, సతీష్, వెంకన్న, రాములు పాల్గొన్నారు.



సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గోవర్ధని, తదితరులు

నేటి నుంచి రామాలయ విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు

● చల్మారెడ్డిగూడెంలో ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
● అధిక సంఖ్యలో మాలలు ధరించిన భక్తులు



ఉత్సవాల కోసం మాల ధరించిన భక్తులు

హాలియా, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్మారెడ్డిగూడెం గ్రామంలో నిర్మించిన సీతారామాంజనేయ లక్ష్మణ, గణపతి, శివస్వామి దేవతా యంత్ర విగ్రహ ప్రతిష్ఠ ధ్వజ స్థంభ ప్రతిష్ఠ మహో త్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. మూడురోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు పాలక మండలి ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం గ్రామ ప్రదక్షణ, తోరబంధనం, గణపతి పూజ, పుణ్యావాచనం, సాయంత్రం హోమగుండ సంస్కరణ అంకురార్పణ, 17న యంత్రాలు, విగ్రహాలకు అష్టోత్తర కలశాలచే పంచామృతా సుగంధ ద్రవ్యోదక సర్వనది తీర్థస్నానం, 18న ఉదయం 9 గంటలకు స్వామివార్ల యంత్ర విగ్రహ ప్రతిష్ఠించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అన్నప్రసాద వితరణ చేప్టనున్నారు. కాటేపల్లి రామలింగేశ్వర శర్మ, రమేష్ శర్మ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి ప్రోత్సహంతో భక్తులు స్వచ్ఛందంగా స్వామివారి మాలలు ధరించి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆలయానికి మేరెడ్డి భద్రారెడ్డి లలితాదంపతులు వారి కుమారులైన మేరెడ్డి కోదండరాం రెడ్డి శ్రీదేవి, రఘోత్తమరెడ్డి సం యుక్త, దేవేందర్‌రెడ్డి సబిత, కటుకూరి రమాదేవీప్రభాకర్‌రెడ్డి దాతృత్వంతో ఎకరం 37 గుంటల భూమిని విరాళంగా అందజేశారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ మంత్రి కుందూ రు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాజరుకానున్నట్లు నిర్వాహకులు రావుల చిన భిక్షం యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు.

హాలియా శివాలయం సమస్యను పరిష్కరించాలి

హాలియా,మే 15(ఆంధ్రజ్యోతి): హాలియాలోని పార్వతి జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఇబ్బందుల గురించి కలెక్టర్ ఇలా త్రిపాఠికి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సమక్షంలో దేవస్థాన కమిటీ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు గురువారం సాగర్‌లో వినతిపత్రం అందజేశారు. ఆలయ భూమిని ట్రస్ట్ డీడ్ పేరుమీద, తహసీల్దార్ ప్రొసీడిగ్స్ తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకొని ఇబ్బంది పెడుతున్నా వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉపాధ్యక్షుడు బందిలి పెదసైదులు, గౌరవ అధ్యక్షులు పిల్లి తిరుపతయ్య, గౌరవ సభ్యులు సపావట్ పాండునాయక్, నాగరాజు ఉన్నారు.

రంగమ్మ కుటుంబానికి మంత్రి తుమ్మల పరామర్శ

మాడ్గులపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పీఏ పోరెడ్డి వెంకట్‌రెడ్డి మాతృమూర్తి రంగమ్మ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు గురువారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌లతో కలిసి గ్రామానికి చేరుకొని రంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట అర్జున్‌రెడ్డి, సైదిరెడ్డి ఉన్నారు.

ఆటల్లేవ్.. ఆడుకోవడాల్లేవ్

● బోర్డులకే పరిమితమైన క్రీడా ప్రాంగణాలు ● అస్తవ్యస్తంగా నిర్వహణ ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి- కొండమల్లేపల్లి) :

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత ప్రభు త్వం లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం అయ్యాయి. కొన్ని చోట్ల క్రీడ స్థలాలు గుట్టల్లో రాళ్ల మధ్య ఏర్పాటు చేయడంతో వాటిని నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆట సామగ్రి సమకూర్చకపోవడంతో క్రీడాకారులు అటు వైపు వెళ్లడం లేదు. కొండమల్లేపల్లి మండలంలోని 26 గ్రామ పంచాయతీలకు 25 క్రీడా ప్రాంగణా లను ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని చోట్ల కీ్రడా ప్రాంగణాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. కేవలం స్థలం ఉండడంతో బోర్డును ఏర్పాటు చేశారు తప్ప క్రీడలకు ఎలాంటి ఉపయోగంగా లేదు. మరి కొన్ని చోట్ల గుట్టల్లో ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం అవి చాలా చోట్ల బోర్డులకే పరిమితమయ్యాయి. పల్లె ప్రగతిలో భాగంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ క్రీడ ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఈ గ్రామీణ క్రీడా ప్రాంగణా ల్లో ఇప్పటి వరకు క్రీడ సామగ్రి కూడా ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడ ప్రాంగణాలను అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు, గ్రామస్థులు కోరుతున్నారు.



చింతచెట్టుతండా గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణం

వినియోగంలోకి తెచ్చే విధంగా చర్యలు

క్రీడ ప్రాంగణాలు నిరుపయోగంగా మారడానికి గ్రామాల్లో పిల్లలు ఎవ్వరూ కూడా క్రీడా ప్రాంగణాల్లో క్రీడలు ఆడేందుకు ఎవ్వరూ రావడం లేదు. మక్కువ చూపట్లేరు. అందుకే అవి నిరుపయోగంగా మారాయి. త్వరలోనే క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

-బాలరాజురెడ్డి, ఎంపీడీవో, కొండమల్లేపల్లి